పల్లె ముంగిట.. ప్రగతి బాట..



విలసవిల్లి గ్రామంలో జరుగుతున్న రహదారి పనులు

- అధ్వాన రహదారులకు రూ.20 కోట్లతో విముక్తి
- మంత్రి చొరవతో పనులకు శ్రీకారం
- తీరనున్న గ్రామీణ వాసుల వెతలు

ఉప్పలగుప్తం: గ్రామాల్లో అధ్వానంగా మారిన రహదారుల రూపురేఖలు మారనున్నాయి. పల్లెవాసుల వెతలు తీర్చేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవ తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్డు ప్రోగ్రాంలో భాగంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నిధుల నుంచి రూ.20 కోట్లు మంజూరు చేయించారు. సదరు నిధులతో అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం మండలాల్లో 27 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. తొలివిడతగా రూ.17.27 కోట్లతో 16.91 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.2.73 కోట్ల బడ్జెట్‌తో మిగిలిన రహదారిని ఆధునిక టెక్నాలజీతో నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులు యోచిస్తున్నారు. ఇప్పటికే ఆయా రహదారులకు సంబంధించి అధికారులు పూర్తి ప్రణాళికలను సిద్ధం చేశారు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమై శరవేగంగా జరుగుతున్నాయి. ఈ విషయం తెలియగానే పరిసర గ్రామాల ప్రజలు వారి దశాబ్దాల నాటి కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి చేయబోయే రోడ్లు

- ఉప్పలగుప్తం మండలంలోని చల్లపల్లి గ్రామం మెయిన్ రోడ్డు నుంచి మత్స్యకార గ్రామమైన వాసాలతిప్ప గ్రామానికి రూ.1.88 కోట్లతో రిటైర్నింగ్ గోడతో పాటు 1.2 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మించనున్నారు.
- భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయపాలెం నుంచి విలసవిల్లి పంచాయతీ పరిధి అశోక్‌నగర్, రెడ్డిపల్లి గ్రామం మీదుగా కామనగరువు వరకు రూ.1.83 కోట్ల వ్యయంతో 2.4 కిలోమీటర్ల బీటీ రోడ్డు వేయనున్నారు.
- ఎస్.కొత్తపల్లి గ్రామంలో జెడ్పీ హైస్కూల్ నుంచి ఫీల్డ్ లేబర్ సొసైటీ హెచ్‌పేట వరకు రూ.1.54 కోట్లతో వ్యయంతో 1.73 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించనున్నారు.
- అల్లవరం మండలంలో డి.రావులపాలెం నుండి ఇందిరానగర్ మీదుగా బాబా నగర్ వరకు రూ.1.8 కోట్లతో 2.39 కిలోమీటర్ల బీటీ రోడ్డు, కొమ్మరిగిరిపట్నం జంక్షన్ నుంచి కడదారి మహాలక్ష్మి అమ్మవారి గుడి వరకు రూ.3.29 కోట్లతో 1.98 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేయనున్నారు.
- సామంతకుర్రు మెయిన్‌రోడ్డు నుంచి గాంధీనగర్ మీదుగా వాసాలతిప్ప మేజర్ డ్రెయిన్ వరకు రూ.2.48 వ్యయంతో 2 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం జరగనుంది.
- అమలాపురం మండలంలో కామనగరువు మెయిన్‌రోడ్డు నుంచి పసిడిచెరువు వరకు రూ.1 కోటి వ్యయంతో 1.6 కిలోమీటర్ల పొడవైన బీటీ రోడ్డు నిర్మించనున్నారు.
- సవరప్పాలెం గ్రామంలో రింగురోడ్డుగా పిలువబడే రోడ్డు నిర్మాణానికి రూ.1.6 కోట్లతో 2.2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు, భట్నవిల్లిలో ఎన్‌హెచ్ 216 నుండి చినవీధి మీదుగా రూ.1కోటి వ్యయంతో కిలోమీటరు పొడవైన సీసీ రోడ్డు వేయనున్నారు.

మంత్రికి రుణపడి ఉంటాం



గత 15 ఏళ్లుగా రోడ్డు అధ్వానంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మొత్తుకున్నా పట్టించుకోలేదు. ఇటీవల సమస్యను మంత్రి పినిపే విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి రోడ్డును మంజూరు చేయించారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– ఉల్లింగి దుర్గారావు, డి.రావులపాలెం, అల్లవరం మండలం

మా నమ్మకం నిలబెట్టారు



దశాబ్దాలుగా అశోక్‌నగర్ నుంచి సింగరాయిపాలెం, కామనగరువు వెళ్లాలంటే నరకం కనిపించేది. సర్పంచ్ ఎన్నికల్లో నేను ఏకగ్రీవంగా ఎంపికైన తరువాత గ్రామస్తులు రోడ్డు వేయించాలని కోరారు. నేను సమస్యను మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన స్పందించి మా నమ్మకాన్ని నిలబెట్టారు.

– సలాది ఊర్మిళాదేవి, సర్పంచ్, విలసవిల్లి, ఉప్పలగుప్తం మండలం

పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం



ఏఐఐబీ నిధులతో ఇప్పటికే కొన్నిచోట్ల రహదారుల పనులు ప్రారంభించాం. కాలువలు, వరిచేల సమీపంలో నిర్మించే రోడ్లు పాడవ్వకుండా రిటర్నింగ్ గోడలను నిర్మిస్తున్నాం. పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం.

– అన్యం రాంబాబు, జిల్లా డిప్యూటీ ఎగ్జికూటివ్ ఇంజినీర్, పంచాయతీ రాజ్ శాఖ

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



భీమనపల్లిలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లిలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి చైత్రశుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి పుష్పాలంకరణ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నవయుగ వైతాళికుడు వీరేశలింగం పంతులు

అమలాపురం టౌన్: కందుకూరి వీరేశలింగం పంతులు తన సాహిత్యం, సామాజిక చైతన్యంతో నవయుగ వైతాళికుడిగా చరిత్రలో నిలిచిపోయారని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. శ్రీశ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలో ఆదివారం జరిగిన కందుకూరి వీరేశ లింగం పంతులు జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, కవి నల్లా నరసింహమూర్తి పాల్గొన్నారు.

విరీతాదేవి దంపతులకు సత్కారం



విరీతాదేవి దంపతులను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి దంపతులను ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు ఆదివారం ఘనంగా సత్కరించారు. చాంబర్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు అధ్యక్షతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఈ సత్కార అభినందన కార్యక్రమంలో చాంబర్ కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, చాంబర్ ప్రతినిధులు రేకపల్లి సూరిబాబు, చింతలపల్లి సత్తిబాబు మాట్లాడుతూ ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి బాధ్యతలు చేపట్టాక ఆలయానికి భక్తుల రాక, అభివృద్ధి పనులు పెరిగాయని పేర్కొన్నారు. ఆలయంలో నిర్వహించిన మరో సభలో విరీతాదేవి దంపతులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, ఈవోలు దూనబోయిన సాయిబాబు, బి.వీర వెంకటేశ్వరరావు తదితరులు సత్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసలవిల్లి గ్రామంలో రూ.9.50 లక్షల జెడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆదివారం శంకుస్థాపన చేశారు. భీమ్‌నగర్‌లో రూ.5 లక్షల వ్యయంతో 75 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం, రూ.4.5 లక్షల వ్యయంతో అంగన్వాడీ భవనం ఆధునికీకరణ చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, వడ్డి గోపాలకృష్ణ, బళ్ళ నాగసతీష్ పాల్గొన్నారు.

సమతా సైనిక్ దళ్ సేవలు

యానాం: యానాం సమతా సైనిక్ దళ్ సభ్యులు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ జిల్లా మౌ పట్టణంలో జరిగిన 132వ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని సేవలు అందించారని చీఫ్ కమాండర్ బత్తుల జాగృత్‌కుమార్ ఆదివారం తెలిపారు. అంబేడ్కర్ చితాబస్మ ర్యాలీలో యానాం, ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన సమతా సైనిక్ దళ్ కమాండర్‌లు డాక్టర్ ఏవీఆర్ ముర్రే, మీరాసాహెబ్, కొల్లాబత్తుల ప్రసాద్‌రావు, సోల్జర్స్ పెయ్యల దుర్గాప్రసాద్, గెద్దం శ్రీను పాల్గొన్నారని చెప్పారు.

నివాళులర్పించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: సాకుర్రు గ్రామంలో ఇటీవల మృతి చెందిన దగాపడ్డ రాష్ట్ర చర్మకారుల రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు ఈతకోట తుక్కేశ్వరరావు సంతాప సభలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుక్కేశ్వరరావు సేవలను ఆయన కొనియాడారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు పానుగోటి కృపాకర్, ముప్పిడి దైవవరప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు



లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు



సీహెచ్ గున్నేపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం

అల్లవరం: ఎస్.పల్లిపాలెం గ్రామంలో సర్పంచ్ కొల్లు వెంకటరమణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సర్వే నిర్వహించి బ్రోచర్లు అందిస్తూ, లబ్ధిదారుల అనుమతితో స్టిక్కర్లు అతికించారు. ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వర్తించాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సామంతకుర్రు సర్పంచ్ సుందరనీడి సాయి, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, ఉపాధ్యక్షులు చెదళ్ల వాసు దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గడప గడపలో జగనన్నే మా నమ్మకం అంటూ ఇంటికి స్టిక్కర్లు అంటించుకునేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- అడవిపేట, రెడ్డిపాలేల్లో గడప గడపకూ..



వేట్లపాలెం గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. అడవిపేట, వేట్లపాలెం కొత్తకాలనీ, రెడ్డిపాలెం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. పేదలందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చేపట్టామన్నారు. లబ్ధిదారులు ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందించేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజల కోసం ఇంత సేవ చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా అడవిపేటకు చెందిన రాగుర్తి యేసుబు అనే టీడీపీ నాయకుడు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, మండల కన్వీనర్ నల్లా నరసింహామూర్తి, సంసాని నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, నీలం బాలయోగి, మోకా చంద్ర నాగరత్నం, అక్కల శ్రీధర్, జగడం బాలయోగి, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అమలాపురంలో గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: అపార్టుమెంట్లలో జీవించే కుటుంబాలు అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించుకోవాలని అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళి కొండబాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం పట్టణంలోని పలు అపార్టుమెంట్ల ఆవరణల్లో అధికారి కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా వంట గ్యాస్ సిలిండర్ల నుంచి ఎదురయ్యే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గృహిణులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్ని మాపక దళం లీడింగ్ ఫైర్‌మెన్ ఎం.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ముమ్మిడివరం అగ్ని మాపక కేంద్రం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక టీటీఆర్ నగర్‌లోని అపార్ట్‌మెంట్స్‌లో గ్యాస్ సిలిండర్ల వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. లీడింగ్ ఫైర్‌మెన్ ఎస్.గంగన్నదొర తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు పెట్టి పంపింగ్ చేయాలి

పీడబ్ల్యూడీ అధికారులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సూచన



ఫ్రెంచి కెనాల్ లాకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి

యానాం: స్థానిక ఫ్రెంచి కెనాల్ నుంచి తాగునీరు సక్రమంగా రావాలంటే పిల్లంక–బ్రహ్మపురి మధ్య ఉన్న ఫ్రెంచి కెనాల్ లాకుల వద్ద మోటార్లు పెట్టి పంపింగ్ చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ సూచించారు. ఆదివారం ఆయన పిల్లంక–బ్రహ్మపురి మధ్యలో ఉన్న ఫ్రెంచి కెనాల్ లాకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే యానాంకు తాగునీటి సమస్య తలెత్తకుండా సహాయపడాలని ధవళేశ్వరం సూపరింటెండెంట్ ఇంజినీరును స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. యానాంకు సైతం వంతులు ఇస్తామని ఫ్రెంచి లాకులు వద్ద క్రాస్‌బండ్ వేసుకుని నీటిని మళ్లించుకోవాలని సూచించారన్నారు. అయినా క్రాస్‌బండ్ వేసే పనులు మొదలుపెట్టకుండా పీడబ్ల్యూడీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. అంతకుముందు తాగునీటి ఎద్దడి నివారణపై ఆర్ఏఓ మునిస్వామితో ఎమ్మెల్యే అశోక్ చర్చించారు. ఫ్రెంచికెనాల్ లాకుల వద్ద వాటర్ లెవల్స్ పరిశీలనకు ఎమ్మెల్యే అశోక్‌తో స్థానిక పీడబ్ల్యూడీ ఇంజినీర్లు వెళ్లకపోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

కూడళ్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ మాధవరెడ్డి

అమలాపురం టౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ప్రతి కూడలిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అమలాపురం డీఎస్పీ వై.మాధవరెడ్డి పిలుపునిచ్చారు. శ్రీరామానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణ దేవత సుబ్బాలమ్మ గుడి సెంటరులో ఏర్పాటైన చలి వేంద్రాన్ని డీఎస్పీ మాధవరెడ్డి ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించి ప్రసంగించారు. చలివేంద్రం ఏర్పాటుచేసిన చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చిక్కం సుబ్బారావు, ఆకుల రాములను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సుబ్బాలమ్మ ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యానాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు యర్రంశెట్టి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



గొల్లవిల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అంబేడ్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో బెడ, బుడగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఇసుకపట్ల రఘుబాబు, గెద్దం సురేష్‌బాబు, తొత్తరమూడి బాబులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత కోరారు. పి.మల్లవరం పంచాయతీ జి.మూలపాలెం గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ రాయుడు సునీత పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భరత్‌కు గురుబ్రహ్మ అవార్డు

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చేతుల మీదుగా ప్రదానం



భరత్‌కు అవార్డు అందజేస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీవాగ్దేవి స్కూల్ డైరెక్టర్ పరసా శ్రీరామమూర్తి(భరత్)కు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ 'గురు బ్రహ్మ' అవార్డును ఆదివారం రాత్రి ప్రదానం చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన సుచిరిండియా సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానోత్సవ సభకు మాజీ ప్రధాన న్యాయమూర్తి రమణ ముఖ్య అతిథిగా పాల్గొని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అయిదుగురికి గురు బ్రహ్మ అవార్డులు అందించి సత్కరించారు. సుచిరిండియా తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో శ్రీవాగ్దేవి స్కూలు విద్యార్థులు ఎక్కువ ర్యాంక్‌లు సాధించినందుకు ఆ స్కూలు డైరెక్టర్ భరత్‌కు అవార్డును అందజేశారు. భరత్‌తో పాటు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు కె.ఆయుభవన్, జి.శ్రీవెంకటేష్, శరణ్య, పి.రేవంత్‌లకు ఇదే వేదికపై సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులు ప్రదానం చేశారు.

కౌలు రైతులు సంఘటితం కావాలి

తాళ్లరేవు: సమస్యలు పరిష్కారం కావాలంటే కౌలు రైతులందరూ సంఘటితమై పోరాడాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అధ్యక్షతన జరిగిన కౌలు రైతుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కౌలు రైతు చట్టాలు భూయజమానులకు లబ్ధి చేకూరే విధంగా ఉంటున్నాయని, చట్ట సవరణకు కౌలు రైతులంతా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, తాళ్లరేవు మండల కార్యదర్శి సల్లా సంతోష్ పాల్గొన్నారు.

భగ్గుమన్న భానుడు.. నిర్మానుష్యంగా రహదారులు



ఎండ తీవ్రత కారణంగా నిర్మానుష్యంగా మారిన సంతపేట సెంటర్

తాళ్లరేవు: గత నాలుగు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి నిత్యం రద్దీగా ఉండే రహదారులు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. తాళ్లరేవులో ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు రావడానికే భయపడిపోయారు. దీంతో తాళ్లరేవు సంతపేట సెంటర్, చెరువుగట్టు సెంటర్, దేవీమహల్ సెంటర్, సుంకరపాలెం జంక్షన్ తదితర రహదారులు జనం లేక వెలవెలబోయాయి.

మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఎక్స్‌గ్రేషియో



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ఒమన్ దేశంలో రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉప్పే ప్రసాద్ కుటుంబానికి ఏపీఎన్ఆర్‌టీసీ సొసైటీ ద్వారా రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియో చెక్కుని ఎంపీ చింతా అనురాధ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లే వారు ఏపీఎన్ఆర్‌టీసీని సంప్రదిస్తే మార్గదర్శకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. గల్ఫ్ దేశాలు వెళ్లేవారు ప్రవాసాంధ్ర బీమా తీసుకుంటే రూ.10 లక్షల ఉచిత ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీసీ అధ్యక్షుడు మేడపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నడక దినచర్య కావాలి



కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సర్వేశ్వరశర్మను సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే నడక అనేది దినచర్య కావాలని స్థానిక సాయి సంజీవిని వాకర్స్ యోగ హెల్త్ సేవా సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక విజయ స్కాన్ సెంటరులో ఆదివారం ఉదయం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ఉపన్యసించారు. ఇటీవల కామన్వెల్త్ ఒకేషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఇన్ సైన్స్ పట్టా అందుకున్న పట్టణానికి చెందిన కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మను సత్కరించారు. కార్యక్రమంలో తేతల సత్యనారాయణరెడ్డి, డాక్టర్ వైవీ నరసింహరావు, కవి నల్లా నరసింహమూర్తి, సంఘం కోశాధికారి బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులకు సత్కారం



సర్పంచ్ అరుణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్: పేరూరు గ్రామ సర్పంచ్ దాసరి అరుణ, డేవిడ్ దంపతులను కొంకాపల్లి గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. కొంకాపల్లి గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు వేసి ప్రజలకు మంచినీటి సౌకర్యం అందించారని వైఎస్సార్ సీపీ రూరల్ కార్యదర్శి సూదా గణపతి కొనియాడారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ అల్లాడ వెంకట రమణ, మట్టపర్తి సూర్యనారాయణ, మట్టపర్తి చంద్రరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్వాయర్ మెషీన్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లవరం: తూర్పులంకలో విద్యుత్ సర్క్యూట్ కారణంగా కడలి ధర్మరాజుకు చెందిన క్వాయర్ మెషీన్లు ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. మెషీన్‌పై పని చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి కొబ్బరి పీచుతో తాడు తయారు చేసే మెషీన్, పీచు రీసైక్లింగ్ చేసే మెషీన్, షెడ్డు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ధర్మరాజు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనా స్థలాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు పరిశీలించి బాధితుడ్ని పరామర్శించారు.